

# సర్పవరం శ్రీ భావనారాయణ స్వామి

సుందర విగ్రహాలకు, శిల్ప సంపదకు పేరెన్నికగన్నది సర్పవరం శ్రీ భావనారాయణస్వామి దేవాలయము. భక్తులు రాష్ట్రం నలుమూలల నుండి ఈ స్వామిని సందర్శించుటకు ప్రతి నిత్యం వస్తుంటారు. ఈ దేవాలయమునకు ఎంతో చరిత్ర వుంది. ఇది తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ఉంది.

కొన్ని శతాబ్దాల క్రితం బుద్ధుడు ఇక్కడకు వచ్చినప్పుడు "ముచళింద నాగుడు" అనే నాగసర్పం పడగ విప్పి నీడ కల్పించి ఎండబారినుండి బుద్ధుని ఉపశమింప చేసి నందుకు ఈ ప్రాంతాన్ని సర్పవరంగా అప్పటి నుండి పిలుస్తారని పూర్వీకులు చెబుతున్నారు.

నారదమహర్షి తాను విష్ణుమాయను దాటగలనన్న అహంభావంతో ఉండగా విష్ణువు అతని అహంభావాన్ని తొలగించి జ్ఞానోపదేశం కలిగించి నందున నారాయణ స్వామికి భావనారాయణ స్వామిగా పేరు వచ్చినట్లు పురాణగాథలు చెబుతాయి. నారదుడు సంసారం చేయుట, పిల్లలు కలగటం తర్వాత జ్ఞానోదయం ఇవన్నీ విష్ణుమాయగా అభివర్ణిస్తారు.

12 వ శతాబ్దం మొదటి భాగంలో కుళోత్తుంగ చోళుని కుమారుడు వీరచోళుడు భావనారాయణ స్వామి ఆలయం నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. సర్పవరం ఆయన కాలంలో "వీరచోడవిణ్ణగరం" అనిపిలిచేవారు.

మనరాష్ట్రంలో భావనారాయణ స్వామి దేవాలయాలు సర్పవరంతోబాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని పట్టిసీమ, భావదేవరపల్లి, గుంటూరు జిల్లాలోని పొన్నూరు. బాపట్లలో కూడా ఉన్నాయి. ఆ పురాణ గాథల ప్రకారం నేటి సర్పవరం ను నాడు సర్పపురంగా వ్యవహరించేవారు.

వీరచోళుడు ఈ ఆలయాన్ని నిర్మించే ముందుగా ఈ ఆలయం ఎదుట "ముక్తికా సరోవరం" ఆవల "నారద సరోవరం" దానికి ఆవల "అనంత సరోవరం' ను త్రవ్వించారు. ప్రస్తుతం ముక్తికా సరోవరం వుంది. ఈ సరోవరం ఎదుట సుమారు 20 సంవత్సరాలు క్రితం అప్పటి పిఠాపురం మహారాజు శ్రీ వేంకట గంగాధరరామారావు ఉత్తరం వైపు గాలిగోపురం నిర్మించారు. ఈ దేవాలయానికి నాలుగువైపులా గాలి గోపురాలు (ద్వారాలు) ఉన్నాయి. 1399లో గోంకరాజు కుమారుడు దేవరాజు శ్రీ స్వామికి ఆరామం (తోట) దానం చేసారు. 1394 లో రేచర్లలో భోగప్రోలు కామరాజు అనేదాత ఈ దేవుని శృంగారభోగం కోసం కొంత భూమిని, అమృతపడి (భోగం) ఆరగించుటకు బంగారు పళ్ళెం దానం చేసినట్టు శాసనాలు ఉన్నాయి.

అలాగే 1388 లో కాటమరెడ్డి కుమారులు వేమారెడ్డి దేవునిపేర కొంత భూమిని కొనుగోలుకు 40 టంకాలు నాడాలు విరాళంగా ఇచ్చారు. ఈ దేవాలయం కాకినాడకు 12 కి.మీ. దూరంలో ఉంది. 1950 ప్రాంతంలో ఈ దేవాలయమును ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. 1986 సంవత్సరంలో ఈ దేవాలయమును అభివృద్ధి పరచాలన్న ఉద్దేశంతో అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం దత్తత చేసుకొంది.

మాఘమాసంలోని ఆదివారాలు వేలాది మంది భక్తులు దేవుని దర్శించు కుంటారు. తిరణాళ్లు (ఉత్సవాలు) జరుగుతాయి. ఎంతో మహిమగల శ్రీ స్వామిని ఎన్ని సార్లు దర్శించుకున్నా తనివితీరదు. భూగర్భములో శ్రీ స్వామి స్వయంగా వెలయగా దానిరూపమును బయట ప్రతిష్ఠించారు. ప్రతి నిత్యం రెండు దేవాలయాలలోనూ పూజ జరుగుతుంది.

— శ్రీమతి తుంగమణి పరుశురామ్

